
# ఎంగిలాకు

డి. లక్ష్మణాచార్య



ప్రొద్దు పొడిచింది!

మహానగరంలో భళ్ళున తెల్లవారింది. అందమైన ఆ నగరం తన కసహ్యమంటూ దూరంగా విసిరేసిన మురికివాడలో—ఒక దినం గడిచిపోయింది జీవన్మరణాల మధ్య కొట్టుకులాడుతున్న రోగిష్టికి గడచిన దినంలా.

సూర్యుడు రోజూ వస్తున్నాడు, అస్తమిస్తున్నాడు. కాలం, వేసవిలో హిమాలయాల్లా కరిగిపోతోంది కాని ఆ వాడలోని మురికి ధ్వాంతం, పెనవేసుకున్న ఆ వాడని వదలడం లేదు, శీతాకాలంలోని నూతన దంపతుల కౌగిలిలా

ఉదయించిన ఆ విరటిసూర్యుడు, వాడ ప్రజలకు పగతో తమ ఆకలి ప్రాణాలపై దండెత్తడానికి వచ్చిన శత్రువులా కన్పించాడు. నిద్ర దేవుడు వారికిచ్చిన ఒక్కగానొక్క వరం!

ఎంకటేశం నిద్రలేచాడు. సూర్యుడి వేడి వాడిని తట్టి మరీలేపింది దానికి తోడు—మూడురోజుల్రకితం ప్రారంభమై తారాస్థాయికి చేరిన ఆకలి మంట!

లేచికూర్చున్నాడు కళ్ళునులుముకొన్నాడు. వాడికి ఎదురుగా—ప్రవహించే మురికి కాలువ నల్లనాగులా! ప్రక్కగా—కూలడానికి సిద్ధంగా వున్న పాత గుడిసెలు! అందులో పేదరికానికి పెద్దసంతానంగా పుట్టి పెరుగుతున్న చీకటి జీవితాలు!

వాటికి దూరంగా—అందమైన నగరంలోని ఎత్తైన అంతస్తులు. పడుచు కన్నె అందమైన మొఖాన్ని వికృతంగా మార్చాలని ప్రయత్నించే నల్లని మచ్చలా— ఆ నగరం ప్రక్కన, ఈ వాడ!

కాలువలోని మురికి కంపు గుప్పున కొట్టింది ఎంకటేశానికి అదివాడికి క్రొత్త గాదు. సుగంధానికీ వాడికీ భూమ్యాకాశాలకున్నంత దూరం.

కాలువలోని మురికి జీవాలు ఆత్రంగా ఏదో తింటూంటే వాటిపై వాడికి ఈర్ష్య కలిగింది.

"ఎదవ బత్కు... ఈ పంది నయం నాకంటే..." ఎంకటేశం పసిమనస్సు అసహ్యించుకుంది తనను తానే.

ఎంకటేశానికి ఎనిమిదేళ్ళుంటాయేమో!

చింపిరి జుత్తు, ఎండిపోయిన గరకలా!

లోతుకుపోయిన జీవం లేనికళ్ళు— ఇంకిపోయిన గుంటలా! వెన్నుతో కలవడానికి ఉరకలేసే కడుపు! ఏ ఆచ్ఛాదనాలేని ఎద్దురొమ్ము! దాని క్రింద తమ ఉనికిని తెలియజేసే బొమికల గూడు!— ఇది వాడి ఆకారం.

ఏ భావకవైనా వాడిని చూస్తే, భావకవిత్వానికి బదులుగా సంఘంపైని కోపం, ఆ అనామకుడిపై దయ—రెండూ కలగలుపుగా అతడి కలంలోంచి రాలడం ఖాయం.

ఎంకటేశంపుట్టిందెక్కడో తెలియదు!

ఒక ఆడది క్షణికమైన కామ వాంఛకు లోబడటం, ఆ మత్తులో భవిష్యత్తును మరిచిపోవడం, తీరా తెలిశాక తన చుట్టూ వున్న సంఘానికి భయపడటం, తనముందు జీవితం సాఫీగా కొనసాగడం కొరకు పసివాడి జీవితం అంధకారం చేయడం ...

ఇది మహానగరాల్లో జరగడం మామూలే! అదే ఎంకటేశాన్నీ మురికి వాడ కప్పగించింది. మురికిలోనే పెరగమని, చీకటిలోనే చావమని తీర్పు నిచ్చింది.

తనకా పేరు ఎవరు పెట్నారో కూడా వాడికి తెలియదు. ఆ వాడలోని వారంతా తనను 'ఎంకటేశం' అని పిలిచారు. అదే తన పేరనుకున్నాడు.

వాడికి ప్రపంచమంటేనే కాదు ఈ మనుషులంటే ఎవరోకూడా అర్థంకాదు. బాధేస్తే 'అమ్మా' అనాలని గూడా తెలియదంటే వాడు పెరిగిన పరిస్థితుల కన్నా ఒక దట్టమైన అడవి నయమనిపిస్తుంది. అయినా ఎంకటేశం కొరకని కాలగమనం ఆగుతుందా? దాని పరుగులో వాడు ఎనిమిదేళ్ళ వాడయ్యాడు.

ప్రతిరోజూ నగరం రోడ్డుమీదకెక్కడం, ఏ పెద్దహోటల్ వద్దనో కాసుక్కూర్చొని చెత్తకుండీలో పడబోయే ఎంగిలాకులకై ఎదురుచూడడం, అవికుండీలో పడగానే తన లాగే వానిపై లంఘించే శునక నేస్తాలతో పోటీ పడటం, నాలుగెద్దింటిని చేజిక్కించుకొని దూరంగా వెళ్ళి తినెయ్యడం, ఏ చెట్టు నీడనో నిద్ర పోవడం.

ఇది వాడి దినచర్య!

మళ్లీ మెలుకువ రాగానే మరో హోటలు! కుక్కలతో పోరాటం, ఎంగిలి విస్తర్ల హస్తగతం... ఆ తర్వాత నిద...

'ఆకలేస్తే తినాలి' అనే వ్యూహ తెల్సిం దగ్గర్నుండీ వాడికి తట్టిన ఉపాయం ఇదొక్కటే.

ఎంకటేశం లేచి నుంచున్నాడు.

తనను వెన్ను చరిచి లేపిన పొద్దు తొందరగా పరుగెత్తాలని ప్రయత్నిస్తుంటే వాడికి కోపం వచ్చింది.

వాడు నడుస్తుంటే చిరిగి పీలికల్లా ఊగులాడే నల్లటి పాత నిక్కరు, చీకటి జీవితాల జాతీయ పతాకంలా వుంది.

ఎప్పటి మాదిరే రోడ్డు ఎక్కి చెత్తకుండీ వైపు నడిచాడు వాడి కడుపులో ఆకలి — శ్మశానంలోని మంటలా!

హోటల్ ప్రక్కకు చేరాడు ఎంకటేశం.

అక్కడ అతనేగాక తన లాగే మరో ఇద్దరు పిల్లలు!!

దేశమాత నుదుటన వున్న వంకర గీతలకు ప్రతినిధుల్లా.

"ఈళ్ళందరి కన్న కుండీ కాడికి నేనే ముందురకాల."

పసివాడి మనస్సు నిర్ణయించుకుంది. ఆ నిర్ణయం అందరి మెదళ్ళలో మెదిలేదే అని వాడికి తెలియదు అది వాడి అమాయకత్వంగాదు- పసితనం!

చెత్తకుండీలో ఎంగిలాకులు పడ్డాయి.

'విజిల్' ఊదగానే పరుగు పందెంలో పరుగెత్తే ఆటగాళ్లలా —పోటీ ప్రారంభమైంది — చెత్తకుండీవద్ద — ఆకలి జీవాల మధ్య—ఎంగిలి విస్తర్లకై.

అనుకున్న విధంగా ముందు ఎంకటేశం పడ్డాడు.

శునక నేస్తాలు వికృతంగా ఘర్జించాయి.

ఎంకటేశం పట్టుకున్న ఎంగిలాకులపై పడ్డాయి.

ఎంకటేశం వానిని వదలేదు.

కుక్కల గొంతులో 'గుర్రు' ఎక్కువైంది. తత్ఫలితంగా పసిచేతులురక్తసిక్తాలయ్యాయి కుక్కల కోర దంతాలు వాడి చేతుల్లోకి దిగాయి చిరిగిన నిక్కరును మరింత చించాయి. ఎంకటేశం చేతుల్లోని ఎంగి లాకులు వాటి నోట్లోకి పోయాయి

పేదవాడికి దొరికిన పెన్నిధి చెయిజారి పోయినప్పుడు కలిగే బాధ — ఎంకటేశం కళ్లలో!

వడి సముద్రంలో మునిగిపోయే వాడికి ఆధారం దొరికి వెనువెంటనే జారిపోయి నప్పుడు కలిగే భయం ఎంకటేశం మొగంలో!

తను గాయపడ్డాననే బాధ లేదు వాడికి చేతికందిన నాలుగు మెతుకులు నోటివరకూ రాలేదనేదే బాధ!

ఎంకటేశం వెనుదిరిగాడు- నగరం రోడ్డు మీది నుండి మురికివాడలోకి!

*  *  *

కళ్లు తెరిచాడు ఎంకటేశం భూమి తిరుగుతూన్నట్లుగా అనిపించింది వాడికి

సూర్యుడు ఆ ప్రదేశాన్ని తనివితీరా కాలుస్తున్నాడు

కాలుతున్న పెనంలా వుంది వాడి వొళ్ళు

తలమీద సుత్తెతో ఎవ్వరో కొడుతున్నట్లు ..

శరీరంపై పదునైన సూదులతో గుచ్చుతూన్నట్లు...

కాళ్ళను విడదీసి ఎవ్వరో లాక్కు పోతున్నట్లు ...

కుక్కలు చేసిన గాయాలకు జ్వరం వచ్చింది. ప్రొద్దు నడినెత్తిమీది కెక్కుతున్నా వాడికి మెలుకువ రాకుండా చేసింది.

అయినా ఆకలి మంట ముందు ఇవన్నీ వాడికి తక్కువే అనిపించాయి. ఎక్కడికి పోవాలో అంతుచిక్కలేదు.

'కుండీ' గుర్తొచ్చినా వెనువెంటనే కుక్కలూ గుర్తొచ్చాయి

పసిహృదయం భయపడింది.

శరీరానికి, తలకూ మట్టి అంటుకున్నా దులుపుకోవాలన్న ధ్యాస లేదు వాడికి

నడుస్తున్నాడు అగమ్యంగా .. వాడిని ఆకలి నడిపిస్తోంది

మురికివాడ నుండి బస్సు రోడ్డుమీదికి... అక్కడనుండి బస్స్టాండుకు .. ఆయాసంతో రైల్వేస్టేషన్‌కు .

స్టేషన్‌లో ప్రయాణీకుల కోలాహలం! ఎవరి సందడి వారిది ఏదీ పట్టించుకునే స్థితిలో లేడు ఎంకటేశం

ఆకలి ఆకలి . ఆకలి ..


వాడి కళ్లలో అదే .. వాడి చూపుల్లో అదే . వాడి అడుగుల్లో అదే .. నాలుగు చక్రాల బండిపై అరటిపండ్లు కన్పించాయి. ఎర్రటి కమలాలూ, మెరిసే ద్రాక్షలూ కనిపించాయి

ఆకలి వీపు చరిచింది— అడుగు ముందుకు వేసాడు. బండి పక్కనే చేతిలో చాకుతో, మీసాలతో 'మనిషి' కన్పించాడు 'కుండీ' దగ్గరి కుక్కలు గోచరించాయి అతడిలో

భయం చెంప చరిచింది — వేసిన అడుగు వెనక్కువేసాడు

అంతా రణగొణధ్వని! 'మైక్' లో ఏదో చెపుతున్నారు అయోమయంగా వుంది

మైకు విన్న ప్రయాణీకుల్లో సందడి మరీ ఎక్కువైంది.



ప్లాట్‌ఫాం మీదకు నడిచాడు ఎంకటేశం.

ఇంతలో వాడి దృష్టి పట్టాల మీదికి మళ్ళింది.

కళ్ళు మెరిశాయి! లోతుకు పోయినాగాని ఆ కళ్లలో ఆ క్షణం ఆనందం తొణికిసలాడింది

లాటరీలో లక్షరూపాయలు పొందిన వ్యక్తి అనుభవించే అనుభూతి కంటే ఎక్కువే ఆ ఆనందం!

దారిన పోయే పేదవాడికి పెన్నిధి కన్పించినప్పుడు కలిగే సంతోషం కంటే కూడా ఎక్కువే ఆ ఆనందం!

పట్టాల మధ్య మెతుకులు చాలా అతుక్కొని వున్న ఎంగిలాకు!

దాన్ని చూసిన వాడి కడుపులోని ఆకలి, కాళ్ళలోకి దిగింది.

నడవమని శాసించింది!

వాడి అడుగుల్లో ఉత్సాహం!

ప్లాట్‌ఫాం నుండి... పట్టాల పైకి దూకాడు. "దూక గలనా లేదా" అనే

## ఎంగిలాకు

ఆలోచనను ఆకలి అడుగుకు నొక్కేసింది.

దూకేముందు దాదాపు దగ్గర వరకూ వచ్చిన ఎక్స్‌ప్రెస్ రైలును వాడు చూడలేదు

రైలును చూసిన ఎంకటేశం, పిల్లిని చూసిన ఎలుకయ్యాడు

వెంటనే ప్లాట్‌ఫాం ఎక్కలేదు

ఆకలి వాడిని ఎక్కనివ్వలేదు

అదిచూసిన ప్రయాణీకుల్లో కోలాహలం!

ఎంగిలాకును అందుకొని ఎక్కాలని వాడి తాపత్రయం.

### అంకితం

— సమాజానికి దూరంగా విసిరివేయబడ్డ అమాయకులంతా "ఎంగిలాకు" ల్లాంటి వారు. వారికి సానుభూతితో ఈ కధ అంకితం.

—రచయిత

రైలు దగ్గరి వరకూ వచ్చింది.

ఎంకటేశం ఎంగిలాకు పైకి వంగాడు.

ఎంగిలాకును అందుకున్నాడు

రాక్షసిలా వచ్చిన రైలు – ఎంకటేశం రక్తాన్ని త్రాగి, కిర్రుమంటూ అరుస్తూ కొద్దిదూరంలో ఆగింది

మునుల రక్తాన్ని త్రాగిన మారీచుని మూతిలా వున్నాయి–రైలు చక్రాలు!

రైలును వెనక్కుపోనిచ్చారు.

అనంత వాయువుల్లో ఎంకటేశం విడిచిన ఆఖరి శ్వాస!

చేతులతో గుండెకు హత్తుకున్న ఎంగిలాకు మాత్రం గాలికి రెప రెప లాడుతూ కన్పించింది

అందులోని తెల్లని మెతుకులు రక్తంలో తడిసి ఎరుపెక్కాయి!

స్టేషన్ బయట జవహర్ విగ్రహం!

ఆయన కళ్ళల్లో అనామకుడి ఆఖరి శ్వాస చిలికించిన వెచ్చటి కన్నీళ్ళు!!


# ఆంధ్రపత్రిక

మదరాసు నగరంలో "ఆంధ్ర పత్రిక", "ఆంధ్ర సచిత్ర వారపత్రిక", "భారతి" (మాసపత్రిక)లు కావలసినవారు ఈ క్రింది చిరునామావారితో సంప్రదించండి

## శ్రీ పి. ఆదిమూలం

64, గౌడియమట్ రోడ్డు, రాయపేట, మదరాసు - 600014.

ఫోను నెం. 848780.

లేక

## ఆంధ్రపత్రిక

156, తంబుచెట్టి వీధి, ఆంధ్ర ఇన్సూరెన్స్ బిల్డింగ్స్, మదరాసు - 600 001.

ఫోను నెం. 21747.